క్లుప్తంగా

బాబు పాలనలో ప్రగతి శూన్యం


వినిస్టన్‌బాబు

పాలకొల్లు అర్బన్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో గ్రాఫిక్స్, బిల్డప్పులు తప్ప ప్రగతి శూన్యమని మరోసారి రుజువయ్యిందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు విమర్శించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం విద్యార్థులకు రూ.3,900 కోట్లు బకాయిలు పెట్టిందని మండిపడ్డారు. కాంట్రాక్టర్ల బిల్లులకు వేల కోట్లు ఖర్చు పెడుతున్నారని, కానీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు మాత్రం చెల్లించకుండా విద్యార్థులను చదువులకు కూటమి ప్రభుత్వం దూరం చేస్తుందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని కోరారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు


నవనీతసేవ అలంకరణలో ఉన్న వేంకటేశ్వరస్వామి

నరసాపురం రూరల్: మండలంలోని కాపులకొడప వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు పెద్దింటి అరుణ్ కుమారాచార్యులు స్వామి వారిని నవనీత సేవలో వెంకటరాముని గా అలంకరించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. స్వామి వారి దర్శనానంతరం దాతల సహకారంతో ఆలయ ఆవరణలో అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏర్పాట్లను చెన్నాప్రగడ చక్రధరరావు, అడ్డాల శ్రీనివాసరావు తదితరులు పర్యవేక్షించారు.

భవిత కేంద్రానికి ఫర్నిచర్ అందజేత

పోడూరు: విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని పరకాల ట్రస్ట్ చైర్మన్ పరకాల సూర్య మోహనరావు అన్నారు. పోడూరు లోని భవిత కేంద్రానికి కవిటం పరకాల ట్రస్ట్ ద్వారా రూ.25 వేల విలువైన ఫర్నిచర్, బోధనా పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా భవిత కేంద్రం వద్ద ఐఈఆర్‌టీ టీచర్ ఎ.కళ్యాణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సభలో పరకాల ట్రస్ట్ చైర్మన్ సూర్యమోహనరావు మాట్లాడుతూ పరకాల ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక బాలుర స్కూలు హెచ్‌ఎం జి.రామకృష్ణ దాతకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పరకాల ట్రస్ట్ ట్రెజరర్ పరకాల రాజేశ్వరరావు, డాక్టర్ కె.అశోక్ కుమార్, ఎం.పార్వతి, జి.ఆమోషి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


విజేతలకు బహుమతులు అందిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి గంగరాజు

నరసాపురం: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు సూచించారు. నరసాపురం మండల న్యాయసేవాధికార సంస్థ డిసెంబర్ నెలలో పట్టణంలోని వైఎన్ కళాశాల. సూర్యా కళాశాల, గౌతమి కళాశాలల్లో విద్యార్థులకు గుడ్, బ్యాడ్ టచ్, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, వివిధ చట్టాలు అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. శనివారం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా జడ్జి గంగరాజు అందుబాటులో ఉన్న చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగిఉండాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్, వైఎన్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు, సూర్యా కళాశాల కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ పాల్గొన్నారు.

జంతు సంక్షేమానికి తోడ్పాటు అందించాలి


వడలి జెడ్పీ పాఠశాలలో జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో ఏడీఏ ప్రమీలా రాణి

పెనుగొండ: విద్యార్థులు జంతు సంక్షేమానికి తోడ్పాటునందించాలనే లక్ష్యంతో జంతు సంక్షేమ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.ప్రమీలారాణి అన్నారు. శనివారం వడలి జిల్లా పరిషత్ పాఠశాలలో జంతు సంక్షేమంపై అవగాహన కల్పించారు. వీధి కుక్కలను దత్తత తీసుకోవడం, అత్యవసర సమయాల్లో వీధుల్లో తిరిగే జంతువులకు ఆహారం అందించడం, కాయలను, పండ్లును అందించే వృక్షాలను రోడ్లకు ఇరువైపులా నాటడం ద్వారా పక్షి సంతతిని అభివృద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.లక్ష్మీనరసింహామూర్తి పాల్గొన్నారు.

నిరుపయోగంగా వర్మీ కంపోస్టు యార్డులు


లంకలకోడేరులో నిరుపయోగంగా ఉన్న కంపోస్టు యార్డు షెడ్లు


కాపవరంలో నిరుపయోగంగా ఉన్న కంపోస్టు యార్డు



భగ్గేశ్వరంలో రోడ్డు పక్కనే వేస్తున్న చెత్త

- రోడ్ల పక్కన పేరుకుపోతున్న చెత్త
- నామమాత్రంగా తడి చెత్త, పొడి చెత్త సేకరణ

పాలకొల్లు అర్బన్: గ్రామ పంచాయతీల్లో తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి వర్మీ కంపోస్టు తయారు చేసి ఆదాయ వనరులను పెంచుకోవాలనే లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి. 2014 నుంచి 2019 వరకు అధికారంలో టీడీపీ ప్రభుత్వం హడావుడిగా షెడ్లు నిర్మించి చేతులు దులుపుకుంది. తదనంతరం అధికారం చేపట్టిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగిస్తూ అపారిశుధ్య నిర్మూలనకు పెద్ద పీట వేసింది. ప్రతి ఇంటి నుంచి తడి చెత్త, పొడిచెత్త విడివిడిగా సేకరించడానికి చర్యలు తీసుకుంది. తడి చెత్త, పొడి చెత్త సేకరణకు వేర్వేరుగా రెండు బుట్టలను ప్రతి ఇంటికీ అందజేసింది. అలాగే గ్రీన్ ఆర్మీ వాహనాలను చెత్త తరలించేందుకు ప్రతి పంచాయతికీ కేటాయించింది. అయితే వర్మీ కంపోస్టు తయారీకి అధికారులు చర్యలు తీసుకోలేదు. దీంతో మండలంలోని లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన 27 వర్మి కంపోస్టు యార్డు షెడ్డులు నిరుపయోగంగా అలంకార ప్రాయంగా మిగిలాయి.

రెండు యూనిట్లకే పరిమితం

గ్రామంలో సేకరించిన చెత్త నుంచి ప్లాస్టిక్ కవర్లు, గాజు సీసాలు, ప్లాస్టిక్ సామాన్లు, చెప్పులు, తాగి పాడేసిన కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ బాటిళ్లు, పాత గుడ్డముక్కలు ఇలా వేర్వేరుగా సేకరించాలి. వర్మీ కంపోస్టు యార్డు లో వీటిని వేరు చేయడానికి ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగిన కూలీలను నియమించడానికి చర్యలు తీసుకున్నారు. దీంట్లో చింతపర్రులో మాత్రమే రెండు యూనిట్లలో వర్మీ కంపోస్టును తయారు చేస్తున్నారు. మిగిలిన 26 గ్రామాల్లో షెడ్డులు ఖాళీగా ఉన్నాయి.

చెత్త సేకరణ శూన్యం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చెత్త సేకరణను పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు ఎక్కడబడితే అక్కడ చెత్త వేస్తున్నారు. గ్రామాల్లో శివారు రోడ్లన్నీ చెత్తతోనే దర్శనమిస్తున్నాయంటే అర్థం చేసుకోవచ్చు. గ్రామ పంచాయతీ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి వర్మీ కంపోస్టు యార్డులను వినియోగంలోకి తీసుకురావచ్చు. కానీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ఇటీవల ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు శిక్షణనిచ్చినా సిబ్బంది కొరతతో చెత్త సేకరణే సవాలుగా మారడంతో ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వర్మీ కంపోస్టు యార్డును వినియోగంలోకి తీసుకుని రావాలని ప్రజలు కోరుతున్నారు.

వర్మీకంపోస్టు తయారీకి చర్యలు



మండలంలోని అన్ని పంచాయతీల్లో వర్మీ కంపోస్టు తయారికి ప్రభుత్వం తాజాగా మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ ఉత్తర్వులు ప్రకారం ఫిబ్రవరి నుంచి అన్ని షెడ్డుల్లో వర్మీ కంపోస్టు తయారు చేయిస్తాం. ఉపాధి హామీ కూలీలకు పని కల్పిస్తాం. కూలీలకు వంద రోజులు పని కల్పించి, వర్మీ కంపోస్టు యార్డులను వినియోగంలోకి తీసుకువస్తాం.

– తాళ్ల మూర్తిబాబు, ఈఓపీఆర్‌డీ, పాలకొల్లు

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

నరసాపురం రూరల్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైందని, వజ్రాయుధం వంటిదని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు అన్నారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని నరసాపురం మండలం సీతారామపురం గ్రామంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల కాలంలో కొన్ని దుష్టశక్తులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు ప్రయత్నిస్తున్నాయని అటువంటి వారిపట్ల ఓటర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజాస్వామ్యం దీర్ఘకాలం వర్ధిల్లాలంటే ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం కొండవీటి సత్యనారాయణ, కొండవీటి వెంకటేశ్వరస్వామి, అడ్డాల శ్రీహరి, తహశీల్దార్ టి రాజరాజేశ్వరి, తదితరులు మాట్లాడుతూ ఓటుహక్కు గొప్ప తనాన్ని వివరించారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లను ఘనంగా సత్కరించారు. అనంతరం కళాశాలలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ మిరియాల లక్ష్మీనారాయణ, వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

మొగల్తూరులో..

సమర్థుడైన, నిష్పక్షపాతంగా వ్యవహరించే నాయకుడిని ఎన్నుకునేందుకు ప్రతి ఒక్కరి చేతుల్లోనూ ఓటనే ఆయుధం ఉందని ఆ ఓటును వినియోగించుకోవాలని తహసీల్దార్ కె.రాజకిశోర్ పిలుపునిచ్చారు. మొగల్తూరు శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఓటు హక్కుపై అవగాహన కల్పించి, సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ సంధ్య, హెచ్‌ఎం వి.రవిశంకర సర్కార్ పాల్గొన్నారు.


నరసాపురం రూరల్: ఓటర్ల దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఆర్డీఓ దాసి రాజు


మొగల్తూరు: సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న అధికారులు

ఓటుతోనే దేశ భద్రత

ఓటు హక్కుతోనే దేశ భద్రతకు రక్షణగా ఉండవచ్చునని ఆచంట డీటీ ఎం సోమేశ్వరరావు అన్నారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం ఆచంటలో ఘనంగా నిర్వహించారు. సీనియర్ ఓటర్లను సత్కరించి, యువ ఓటర్లకు ఓటు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: భారత ఎన్నికల కమిషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని జాతీయ ఓటర్ల దినోత్సవంగా ప్రతి ఏటా జనవరి 25వ తేదీన నిర్వహిస్తుంటారని తహసిల్దార్ యడ్ల దుర్గా కిషోర్ అన్నారు. పాలకొల్లు పట్టణంలోని ఎంఎంకేఎస్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా యడ్లబజార్ సెంటర్ నుంచి సుబ్బారాయుడు గుడి వరకు ర్యాలీ చేసి అనంతరం మానవహారం నిర్వహించి ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు, బీఎల్‌వోలకు పాఠశాల ఆవరణలో రంగోలి, క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో సీనియర్ ఓటర్లు రాజా తాతయ్య తదితరులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కర్నేన గౌరునాయుడు, కోడి విజయ భాస్కర్, పాముల రజనీకుమార్, బోనం చిన బాబు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.టి రాజరాజేశ్వరి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీకే మల్లేశ్వరరావు, అధ్యాపకుడు టి.కృష్ణ పాల్గొన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: ప్రజాస్వామ్యంలో ప్రజల తలరాతలను మార్చే శక్తి ఓటుకు ఉంటుందని తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక తమ్మినీడి ఉమానరసింహ కల్యాణ మండపంలో సీనియర్ ఓటర్లను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నందిపాటి ప్రేమాన్విత, ఎంఈఓ కనుమూరు వెంకట రామకృష్ణంరాజు, ఆర్ఐ కవురు యశోద పాల్గొన్నారు.

ఓటు హక్కుతో ప్రజాస్వామ్య పరిరక్షణ

పెనుగొండ: ఓటు హక్కుతో ప్రజా స్వామ్య పరిరక్షణకు యువత నడుం బిగించాలని పెనుగొండ తహసీల్దారు జి.అనితకుమారి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సం సందర్భంగా చెరుకువాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీనియర్ ఓటర్లను సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లోని విజేతలకు బహుమతీ ప్రధానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ, హెచ్‌ఎం పెండ్యాల భరణీకుమార్ తదితరులు పాల్గొన్నారు.


పెనుగొండ: చెరుకువాడ జెడ్పీ పాఠశాలలో సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న దృశ్యం


పాలకొల్లు అర్బన్: ఎంఎంకేఎన్ మునిసిపల్ హైస్కూల్‌లో సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న అధికారులు


యలమంచిలి: ఉమా నరసింహ కల్యాణ మండపంలో సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న తహసీల్దార్

నిధులు సక్రమంగా వినియోగించాలి


సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: పాఠశాలలకు కేటాయించిన నిధులు సక్రమంగా వినియోగించాలని సామాజిక తనిఖీ ఎస్ఆర్పీ గోవింద అన్నారు. శనివారం ఆచంట మండలం ఆచంట వేమవరంలోని జేఎన్‌బీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించారు. పాఠశాలకు విడుదలైన నిధులు సద్వినియోగం, మధ్యాహ్న భోజన పథక నిర్వహణ, గ్రంథాలయ పుస్తకాలు, క్రీడా సామగ్రి, పాఠశాల ఉపాధ్యాయుల పనితీరు విద్యార్థుచదువుపై ఆరా తీసారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్పీ సీటి నాగరాజు, ప్రధానోపాధ్యాయులు నెక్కంటి కృష్ణవేణి, యాజమాన్య కమిటీ చైర్మన్ గుత్తుల చిరంజీవిలు పాల్గొన్నారు.

పెనుగొండ గురుకుల పాఠశాలలో

పెనుగొండలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించారు. ఎస్ఎస్ఏ డీఆర్పీలు బి.బాల చెన్నయ్య, ఎన్.విజయ సాగర్, ప్రిన్సిపాల్ టి.ఎస్తేర్ క్వీరీ, ఎస్ఎంసీ చైర్మన్ ఆర్.ప్రమీలా కుమారి పాల్గొన్నారు.

పశువుల సంరక్షణ కోసమే పశువైద్య శిబిరాలు


యలమంచిలి: అబ్బిరాజుపాలెంలో పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న పశు వైద్యాధికారి డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి


నరసాపురం రూరల్: ఎల్బీచర్లలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

యలమంచిలి: పశువుల సంరక్షణ కోసం ఏర్పాటుచేస్తున్న పశు వైద్య శిబిరాలను పాడి రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని అబ్బిరాజుపాలెం సర్పంచ్ కామిశెట్టి సాయిబాబు కోరారు. మండలంలోని బూరుగుపల్లి, అబ్బిరాజుపాలెం గ్రామాలలో శనివారం ఏర్పాటుచేసిన పశు వైద్య శిబిరాలను ఆయా గ్రామాల సర్పంచ్‌లు చెల్లింకుల లక్ష్మి, కామిశెట్టి సాయిబాబు ప్రారంభించారు. పశు వైద్య శిబిరాల్లో 94 పశువులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. శిబిర నిర్వహణకు బోనం నాని, మామిడిశెట్టి పెద్దిరాజు, రేఖపల్లి రెడ్డినాయుడు, వలవల బాబి, నంబుల రంగారావు, జవ్వాది వెంకటేశ్వరరావు సహకరించారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాల్లో పశు సంవర్ధక సహాయకులు జాజిత, జాజిమొగ్గల హేమలత, నిల్లా కోట సత్యశ్రీ, సతీష్, షబీర, తరుణ్, దుర్గా భవాని పాల్గొన్నారు.

ఎల్బీచర్లలో..

నరసాపురం రూరల్: రైతులు, పశు పెంపకందారులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎల్బీచర్ల సర్పంచ్ గుబ్బల యమునా భానుమూర్తి అన్నారు. శనివారం నరసాపురం మండలం ఎల్బీచర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరంలో 44 పశువులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. వాటికి అవసరమైన మందులను పెంపకందారులకు అందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కటకంశెట్టి నరసింహమూర్తి, మండల పశువైద్యాధికారి ఇంజేటి సురేంద్రకుమార్, సిబ్బంది నారా కృష్ణసాయి, చందుకుమార్, నరేష్, సంజయ్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముసలమ్మ ఉత్సవాలు

యలమంచిలి: మండలంలోని అడవిపాలెం పంచాయతీ పల్లపు వీధిలో ఉన్న శ్రీ పుంతలో ముసలమ్మ వారి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మొదటి వార్షికోత్సవం సందర్భంగా పాలకొల్లు వీరన్నబాబు గద్దె నిర్వాహకులు పశ్యావుల అనంత ప్రసాద్, పోలిశెట్టి సాయి ప్రసాద్ బ్రహ్మత్వంలో శనివారం అమ్మ వారికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా మహిళలతో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.


సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

స్మార్ట్ మీటర్ల వ్యతిరేక ప్రచారం

పెనుగొండ: ప్రతి ఒక్కరూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వ్యతిరేకించాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా విజ్ఞప్తి చేశారు. శనివారం స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ పెనుగొండలో జిలం చెరువు, రామచంద్రరావు పేట, కోడి పందేల దిబ్బ, ఇందిరా శాంతినగర్, చెరుకువాడలతో పాటు, పెనుగొండ ప్రధాన ప్రాంతాలో విస్తృతంగా మైక్ ప్రచారం నిర్వహించారు. ప్రజలు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించి పాత విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్ వెంకటేశ్వరరావు, మాదాసు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బేటీ బచావో-బేటీ పఢావో 2కే రన్


పట్టణంలో 2కే రన్ నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం: జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బేటీ బచావో-బేటీ పఢావో 10వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలో 2కే రన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మిషన్ హైస్కూల్ రోడ్డు నుంచి ప్రకాశంరోడ్డు, స్టీమర్‌రోడ్డు మీదుగా అంబేడ్కర్ సెంటర్ వరకూ రన్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ మైనర్టీ వ్యవహారాల సలహాదారు ఎంఏ షరీఫ్, నరసాపురం డీఎస్పీ జి.శ్రీవేద పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్లను వినియోగించుకోవాలి


ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కమిషనర్ అంజయ్య

నరసాపురం: ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు నిమిత్తం పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెంటర్ల సేవలు వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య సూచించారు. శనివారం పట్టణంలోని వనువులమ్మగుడి ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధార్ అప్‌డేట్, చిన్నపిల్లల ఆధార్ నమోదు వంటి వాటికి అవకాశం కల్పిస్తూ ఈ ప్రత్యేక సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10 గంటలు నుంచి సాయంత్రం 5 గంటలు వరకూ సెంటర్లలో సిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు. సెంటర్లకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సేవలందించాలని సిబ్బందికి సూచించారు.

పాలకొల్లులో మెగా జాబ్ మేళా


నియామక పత్రాలు అందజేస్తున్న మంత్రి నిమ్మల

పాలకొల్లు అర్బన్: నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు పట్టణంలోని బీఆర్ఆర్ అండ్ జీకేఆర్ డిగ్రీ, పీజీ కళాశాల ఆవరణలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాను మంత్రి నిమ్మల ప్రారంభించారు. సుమారు 20కి పైగా కంపెనీ ప్రతినిధులు పాల్గొని 540 మందిని ఎంపిక చేశారు. వీరికి మంత్రి నిమ్మల చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దాసి రాజు, తహసిల్దార్ యడ్ల దుర్గాకిషోర్, జిల్లా స్కిల్ డవలప్‌మెంట్ ఆఫీసర్ పి లోకమాన్, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ బి.వరలక్ష్మీ, ఛాంబర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కారుమూరి వెంకట నరసింహారావు పాల్గొన్నారు.